మాక్లీదుర్గంలో కుక్క

విశ్వనాథ సత్యనారాయణ

1895-1976

విశ్వనాథ పరిచయం అక్కరలేని కవిసమ్రాట్. సాహిత్యంలో ఆయన చేపట్టని ప్రక్రియ లేదు. పద్యకావ్యం, నవల, నాటకం, కథ, వ్యాసం సమస్తం వారి కలం నుంచి వెలువడి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. దీపావళి సందర్భంగా యీ కథను మా పాఠకులకు అందిస్తున్నాం. జాతి అహంకారాలు, వంశపరంపరలపై వుండే భ్రమలను యీ కథలో అనూహ్యంగా చిత్రించారు. ఈ కథ రచనా కాలం 1932.

1

మాక్లీదుర్గం రైలు స్టేషను గుంటకల్లు నుంచి బెంగుళూరు పోయే త్రోవలో నాల్గు స్టేషనుల కివతల నున్నది. ప్లాటుఫారంకన్న రైలు స్టేషను పదిగజాలు ఎక్కి వెళ్ళాలి. రైలు రోడ్డు ప్రక్కనే పెద్ద కొండ ఉన్నది. దానినిండా చెట్లూ చేమలూ, రాళ్ళూ రప్పలూ ఉన్నవి. అప్పుడప్పుడు వేగోలాలు *(వేగోలం అంటే హైనా జాతికి చెందిన క్రూర జంతువు)* సివంగులు రాత్రిళ్ళు స్టేషనులోకి వస్తూ ఉంటవి. స్టేషనుకు వెనుక పెద్ద లోయ ఉన్నది. ఆ లోయ అంతా సారవంతమైన ప్రదేశం. లోయ కవతల తట్టు ఉన్న కొండమీద ఎవరిదో భాగ్యవంతులది పెద్ద సౌధం ఉన్నది. ఈ లోయలో రెండు మూడు నాలుగు ఉన్నవి.

మాక్లీ దుర్గం స్టేషను చాలా చిన్నది. అందులో చిన్న అంగడి ఉంది. రైళ్ళు వచ్చే వేళకు ఆ అంగడి తెరిచి ఉంటుంది. ఒక కుక్క అంగడి తెరచినప్పుడల్లా అక్కడ తయారు. అంగడి ఎత్తుగా ఉంటుంది. కుక్క తన చూపు అంగడిలోని పళ్ళికలలో ఉన్న మిఠాయి మీద పడే అంత సమరేఖలో ఉంచుకొని ఊర్ధ్వ దృష్టితో తపస్సు చేస్తుంది.

అక్షరం

ఒక మాట నుండి
తర్వాతి మాట వైపు పాకుతుంటాను
రెంటి మధ్యలో మరింత వెలుగు!
దృశ్యానికీ మాటకూ మధ్య
మాటకూ మౌనానికీ మధ్య
మౌనానికీ స్వప్నానికీ మధ్య
స్వప్నానికీ మరపుకీ మధ్య
కవిత్వం
తొణికి పడక తప్పదు.

లక్షలాది ఆకులు
గాలిని గద్దిస్తున్నాయి
ఉద్యమాలకు ఊపిరి ఇదే!
ఈ శిలకు
అనంతకాలం అంటుకొని వుంది
అందుకే
శతాబ్దాల గాలులకు
కొట్టుకపోకుండా నిలిచి వుంది
అక్షరంలాగ!

-డా॥ ఎన్.గోపి

ఎప్పుడైనా, వాడంగడి సర్దేటప్పుడైనా, యెవడైనా కొనుక్కునేటప్పుడైనా చిన్న ముక్క జారిపడుతుందేమో అని యెదురు చూస్తూ ఉంటుంది. వారానికో పదిరోజులకో అట్లా యెప్పుడూ పడదు గాని, పది రోజుల క్రింద చేసిన పకోడీ కొనుక్కొన్నవాడు చద్దివాసన వేసి పారేస్తే కుక్క దాన్ని నోటితోఅగావుగా పట్టుకొని ముందు పళ్ళతో నొక్కి అంగట్లోకి పోయేందుకు రెండు గతుకులు గతికి మ్రింగి దగ్గ వచ్చి మళ్ళీ కక్కుతుంది. రైలు వెళ్ళిపోవటం తోటే అంగడివాడు మూస్తాడు. కుక్క పోయి సెలయేట్లో నీళ్ల తాగుతుంది. ముందు కాళ్ళు చాచి గడ్డిమీద పడు కొని, లేత గరిక పోచలు కొరుకుతుంది. ఆ కుక్క మంచి మిడితల వేటకాడు. అప్పుడప్పుడు పొలము పిచ్చుకలను గూడా పట్టుకుంటుంది. సెలయేటి నీళ్లూ, మంచి గాలీ, లోయలోకి దిగటం, ఎక్కటం- కుక్క మంచి దేహపటుత్వంలో ఉన్నది. కుక్క చెదరిఐనా స్టేషనెదురుగా ఉన్న కొండమీదికి పోదు.

ఒకసారి ఒక పెద్దమనిషి ఆడ సీమకుక్కను స్టేషనులోకి తెచ్చాడు. వాటి రెంటికీ ప్రథమ దర్శనంలో ప్రణయం ఏర్పడ్డది. ఆ పెద్దమనిషి చేతిలో కర్ర ఉంది. దాన్ని చూచి మన కుక్క తన ప్రియురాలి దగ్గరికి వెళ్ళింది కాదు. పుట్టింట ఉన్న ఆడపిల్ల వలె సీమకుక్క మాత్రం నిర్భయంగా తన వలపుకాణ్ణి చూడటం మొదలెట్టింది. పెద్ద మనుష్యులు తన్ను పోకిరీ అనుకుంటారేమోనని దుర్గపు కుక్క దానివంక చూచీ చూడకుండా చూడటం మొదలెట్టింది. పెద్దమనిషి తన కుక్కను కటకటాలకు కట్టివేసి సామానులు తూయించుకోటానికో దేనికో వెళ్ళాడు. రెండు కుక్కలూ కలిసి కొన్నవి.

స్టేషను మాస్టరు కొంచెము చదువుకొన్నాడు. పెద్దమనిషికీ, ఆయనకీ ఆధునిక సిద్ధాంత రాద్ధాంతాల చర్చ జరుగుతోంది.

స్టేషను మాస్టరు: కాదండీ! వర్ణ వ్యవస్థ ఉండాలి. మన పూర్వులు దాన్ని నియమించారు. వాళ్ళు ఏ ప్రయోజనాల కోసం దాన్ని ఏర్పరిచారో ఆ ప్రయోజనాలు తెలియకుండా మనం వాటిని తీసివేయరాదు.

పెద్దమనిషి: అట్లా అంటే లాభం లేదండీ! ఆ సిద్ధాంతాలేమిటో చెప్పండి. మనవాళ్ళు ఏర్పరచారు కదా అని గ్రుడ్డి ఎద్దు చేలో పడ్డట్లు పోరాదు. మన వాళ్ళు చెప్పారు కదా అని వినే రోజులు పోయినై. ప్రతిదీ వాదానికి నిలవాలి. వాదానికి నిలవంది మేము ఒప్పుకోము.

స్టే.మా: వారు ఏ ప్రయోజనాలర్థించారో మనకు తెలియదు. మనకు వాటిని తెలుసుకునేటంత మేధాశక్తి లేదు.

పె.మ: దానికి నేనొప్పుకోను. జ్ఞానము ప్రపంచం నడచినకొద్దీ వృద్ధి అవుతుంది గాని తగ్గడం లేదు. మన పూర్వులకు మనకున్నంత వాదనాశక్తి లేదంటాం. మానసిక శాస్త్రం ఇప్పుడు వృద్ధి అయినంత పూర్వం వృద్ధి కాలేదు.

స్టే.మా: అయితే మీరు వర్ణ వ్యవస్థ తీసిపారవెయ్యాలి అంటారా?

పె.మ: తీసివెయ్యాలంటాను. ఈ వ్యవస్థ మూలంగా అనేక భేదాలేర్పడుతున్నవి. కొంద రనవసరంగా తాము గొప్పవాళ్ళ మనుకొంటున్నారు. తక్కువ కులాల మీద అధికారం చలాయిస్తున్నారు. వర్ణాంతర భోజనాలు, వివాహములూ జరగవలె. అప్పుడు దేశానికి ముక్తి.

స్టే.మా: సర్వత్ర భూతములయందూ సమత్వం ఉండాల్సిందే కాని వర్ణాంతర వివాహం నేను ఒప్పుకోను. పైకి కనపడే భేదాలు మనసా లేకుండా చేసుకోవాలి. మన పూర్వులు కూడా అదే చెప్పారని నా ఉద్దేశం.

పె.మ: మనవాళ్ళట్లాగూ చెప్పలేదు. మనవాళ్ళు సంఘానికి చేసిన ద్రోహం ఇంతంత కాదు.

పెద్దమనిషి బయటికి వచ్చాడు. తన కుక్క వంక చూచాడు. రెండు కుక్కలూ తమ వర్ణ భేదం మరిచిపోయి కలిసికొంటున్నవి. పెద్దమనిషి పరుగెత్తుకొనిపోయి దుర్గపు కుక్కను పది పదకొండు దెబ్బలు కొట్టినాడు. 'జ్ఞాతాస్పద' మైన ఆ కుక్క వెంటనే వదలిపెట్టడానికి సమర్థము కాక చివరకు వదిలించుకొని పోయింది. స్టేషను బయటకు పోయిన తరువాత కుక్కకు తెలిసింది, తన తొంటి విరిగిందని. ఆ పెద్దమనిషి తన కుక్కను కూడా నాలుగు మోదినాడు.

స్టేషను మాస్టరీ గందరగోళం విని బయటకు వచ్చాడు. సంగతంతా తెలిసికొన్నాడు. "అయ్యా, ఎందుకు కుక్కనట్లా కొట్టారు?" అన్నాడు.

పె.మ: ఇది జాతి గల కుక్క. దీనికి తోడు మగ కుక్కను కొనవలెనని చాలా ప్రయత్నం చేశాను. దొరకలేదండీ. దీనికి ఋతువు వచ్చింది. దీన్ని బెంగుళూరు తీసుకు పోతున్నాను. ఈ జాతి మగకుక్కతో కలపవలెనని.

స్టేషను మాస్టరు కొంచెము నవ్వాడు. పెద్దమనిషి కనుబొమల మీద మాత్రం కొంచెం నల్లని రేఖ యేర్పడ్డది. ఆయనా నవ్వాడు.

తరువాత మళ్ళీ యిద్దరూ స్నేహంగా మాట్లాడుకొన్నారు. స్టేషను మాస్టరు సీమకుక్క అందానికి, మొగాన మచ్చకూ, తోక కుచ్చుకూ, దాని గోధుమ వన్నె రంగుకూ

మిక్కిలి మెచ్చుకొని దాన్ని ముద్దాడాడు. దానికి పిల్లలు పుడితే నాకో పిల్లను తప్పకుండా ఇవ్వాలని వాగ్దానం చేయించుకొన్నాడు.

ఊరకుక్క సంసర్గం చేత సీమకుక్క ఒళ్ళంతా మన్నయింది. అంతకు ముందే వాన కురిసి పక్కనున్న పెద్ద బండల మీద నీటిపడెలు కట్టినై. పెద్ద మనిషి తన తోలుపెట్టె తెరచి రెండుతికిన తువాళ్ళూ, సబ్బుబిళ్ళా తీసి ఆ పడెలో కుక్కను అభ్యంగనము చేయించి తువాళ్ళతో దాన్ని చక్కగా తుడిచాడు. ఇంతలో రైలు వచ్చింది. ఆయన కంయి కంయి మని అరుస్తున్న కుక్కను తువాళ్ళతో చుట్టి చంకను పెట్టుకొని రైల్లో ఎక్కాడు. మగకుక్క ఆడ కుక్కకు దూరంగా నిలుచుండి కుంటుతూ కుంటుతూ దానివంకనే సాకూతంగా చూడడం మొదలుపెట్టింది. ఆయన కిటికీలోంచి తొంగిచూచి కుక్కవైపు రెండుసార్లు కర్ర ఆడించాడు. అది మరీ దూరం పోయింది.

రైలు సాగింది. సీమకుక్క కంయి కంయి మని తలుపు దగ్గరకు పోతుంది, తొంగి చూస్తుంది. అతడు గొలుసుతో లాగి పట్టుకున్నాడు. రైలు బెంగుళూరు పోయిన తరువాత కుక్క ఏడుపు మానేసి యజమాని దగ్గర చనువుగా కూర్చుంది. అతడు దాన్ని ఒళ్ళోకి తీసుకొని "లీలా! అల్లా చెయ్యవచ్చునా?" అని దాని నోట్లో నోరుపెట్టి ముద్దు పెట్టుకొన్నాడు. ఇందాకటి కుక్క ఈ పనే చేస్తే అంత హృదయంగమంగా ఊరుకొన్న ఆ కుక్క పరపురుష చుంబనం పరిహరించినట్లుగా అతని చుంబనం పరిహరించింది.

2

దుర్గములో కుక్క తన తొంటి గాడిద గరపాకులకూ, అడ్డసర ఆకులకూ వేసి రుద్దుకొని సెలయేటి ఒడ్డున ఉన్న ఒండ్రుమట్టితో అద్దుకొని పదిహేను రోజులకు కాలు సరిచేసుకొన్నది. మళ్ళీ స్టేషనులోకి వస్తున్నది. మిఠాయి దుకాణం వంక చూస్తున్నది.

ఒకనాడు ఇద్దరు విద్యార్థులు అక్కడికి వచ్చి దుకాణంలో ఏదో కొనుక్కొని తింటూ బల్లమీద కూర్చున్నారు. వాళ్ళ యిద్దరి మాటలూ కుక్క చెవిని పడ్డవి.

"మన దేశంలో భూతదయ అన్నది లేదు. పెద్దవాళ్ళందరూ పిన్నవాళ్ళ మీద అధికారం చేస్తారు. నేను బి.ఏ. ప్యాసైనాను. ఉద్యోగమిచ్చే దిక్కు లేదు. పేదవాళ్ళు మలమల మాడిపోతున్నారు. గొప్పవాళ్ళు సోఫాల మీద గాని ఒరగరు" అన్నాడు ఒకడు.

"మనవాళ్ళు అందరూ స్వార్థపరులే. పిడికెడు బిచ్చం పెట్టరు. చివరకు కుక్కకు వేసినట్లన్నా పేదవాళ్ళ కింత వెయ్యరు" అన్నాడు రెండోవాడు.

కుక్క వాళ్ళ దగ్గరకు వచ్చి వాళ్ళ చేతిలో పొట్లం వంక చూసింది. వాళ్ళిద్దరూ ఇంగ్లీషులో మాట్లాడుకొంటున్నారు. అందులో ఒకటని కాళ్ళకు బూట్లు ఉన్నవి. కాలు మీద కాలు వేసుకు కూర్చున్నాడు. ఆ బూటు కాలితో కుక్కను డొక్కలో తన్నాడు. దానికి రెండు మూడు రోజుల నుంచీ తిండిలేదు. ఆ దెబ్బ పొట్టలో ఏ నరానికి తగిలిందో అది మెలికలు తిరిగిపోయింది. కొంతసేపటి కది తెప్పిరిలి లేచిపోయింది. రెండవ విద్యార్థి తన చేతిలోది కొంచెం దాని ముందర వేశాడు. అది నొప్పిచేత దానిని ముట్టుకోకుండా పోయింది.

ఆ రోజు సాయంత్రం కొండ మీద నుంచి ఒక వేగోలం దిగి రాత్రిపూట స్టేషనులోకి వచ్చింది. కుక్క భయపడి దుకాణం క్రింద గూడుగా ఉంటే దానిలో దాక్కుంది. స్టేషనంతా నిర్జనంగా ఉంది. వేగోలం పసి పట్టి ఆ గూటిదగ్గర కాపలా వేసింది. వేగోలం మూతి గూట్లోకి పెడితే కుక్క లోపల దాక్కొని దాని నోరంతా కరిచింది. వెనక్కు తిరిగితే తోకా, పృష్ఠభాగం గాట్లు చేసింది. వేగోలం మైమరచి ఉంటే కొంచెం బయటికి వచ్చి దాని మెడ పట్టుకొని గుంజింది. అది కరవ వస్తే తను గూట్లో దాక్కుంటుంది. ఇట్లా మూడు నాలుగు గంటలు దాగుడు మూతల యుద్ధం చేసి ఒక ఒడుపులో వేగోలం పీక పట్టుకొని దాని ఊపిరి ఆగేదాకా కుక్క వదలలేదు.

తెల్లవారిన తరువాత అందరూ వచ్చారు. కుక్క పౌరుషం చూశారు. ఏడాది రెండేండ్లుగా మర్యాద లేని ఆ కుక్కకు ఆనాటితో మర్యాద యెక్కువైంది. స్టేషను మాష్టరు దానికి రోజూ అన్నం వెయ్యమని ఫర్మానా యిచ్చాడు. ఆ రోజు సాయంకాలం అంగడి వాడికి మహాదయ కలిగింది. ఒక్క బూందీపూస బీరువోనియ్యని ఆ పిసినిగొట్టు సంవత్సరముబట్టీ పరిశిష్టపు నూనెతో పరిశిష్టంగా వస్తున్న మిఠాయి జంగిలీ దాని ముందర పెట్టాడు. ఆ మిఠాయి మరెవ్వరూ కొనరు. ఎవ్వరూ కొనకపోవడం చేత, వారం రోజుల కొకసారి తాజాగా నూనెలో వేస్తున్నా ఎవ్వరూ కొనలేదు. కుక్క మీద మహాదయ పుట్టి ఆ జంగిలీ దానిముందర పెట్టాడు. అది

ఆణిముత్యాలు

తిన్నది; ఆప్యాయంగా తిన్నది. ఆ రాత్రి కుక్క తెల్లవార్లూ మహా బాధ పడుతున్నట్లుగా ఏడవటం మొదలుపెట్టింది. ఇంట్లో పడుకొన్న స్టేషను మాస్టరూ, పోర్టర్లూ వేగోలాలు వచ్చినై అనుకొన్నారు. కుక్క పగలు పోయి పొలాల మీద, అడవుల మీద తిరిగి వస్తుంది. దానికేదో మహా వాతం పుట్టింది. కనపడ్డ ఆకల్లా కొరికింది. ఏ ఆకూ పనిచెయ్యలేదు. ఒండ్రుమట్టి నాచేత కాదంది. సెలయేటి నీళ్ళు ఇది మా పని కాదన్నవి. రాత్రిళ్ళు స్టేషనులో పడి యేడుస్తుంది. మెలికలు తిరిగిపోతుంది, తన నడుము రైలుకింద పడ్డట్టు గోల కెత్తుతుంది.

వారము రోజులీరీతిగా కొట్టుకులాడితే దాని వ్యాధి ఉపశమించింది. రెండు రోజులుపవాసం ఉండి కూడా వేగోలాన్ని చంపిన యీ కుక్క వారము రోజులయ్యేటప్పటికి చిక్కి శల్యమయింది. దాని వెనుక కాళ్ళూ మొత్తా తప్పబడిపోయినవి. అది యెక్కడో ఒకచోట పడుకొని మూలగడానికి కూడా ఓపిక లేకుండా సన్నగా యేడుస్తుంది. దానికి మిఠాయి అంగడి అంటే భయం వేసింది. అంగడి వైపు పోదు, అంగడి వంక చూడదు. మునుపు స్టేషనులో యథేచ్ఛగా తిరిగేది. స్టేషను మాష్టరు గదిలోకి పోయి తొంగి చూస్తే చీడకుక్క, పేలకుక్క అని దాన్ని కొట్టడం మొదలుపెట్టారు.

3

ఆరు నెలలైంది. ఆ కుక్క చావదు, బతకదు. ఒకరోజు సీమకుక్కను తెచ్చిన పెద్దమనిషి వచ్చాడు. మాస్టరూ, ఆయనా పూర్వ పరిచయాన్ని మగిడించుకొని మాట్లాడుకొన్నారు. మాస్టరు "ఏమండీ, కుక్క పిల్లలను పెట్టిందా?" అని అడిగాడు: పెద్దమనిషి ఇల్లా అన్నాడు. "అయ్యా, కుక్కను బెంగుళూరు తీసుకెళ్ళాను. జాతికుక్క నెక్కనివ్వలేదు. మీ పాడుకుక్క పాడుచేసింది. కుక్క రెండు పిల్లలను పెట్టింది. ఊరకుక్కల్ని పెట్టింది. నాకు చాలా విచారం వేసింది. ఈసారి మంచి పిల్లలు పెడితే మీకు తీసుకువచ్చి యిస్తాను." స్టేషను మాష్టరు "మా కుక్క చాలా మంచిదండీ! అది మంచి పౌరుషశాలి. కొన్నాళ్ళ క్రింద అది వేగోలాన్ని చంపిం"దన్నాడు. పెద్దమనిషి "పోనిద్దురూ! వెధవ కుక్క! 'నాకు దానిని చంపవలెనని ఉంది. ఇంకా అది మీ స్టేష నులో ఉంటే చూపించండి. దాన్ని నరికి పోతా"నన్నాడు. ఇంకా స్టేషను మాష్టరు "ఏదో పెద్ద వాతం పుట్టి కుక్క పాడైపోయిం"దన్నాడు.

ఇంతలో ఆ కుక్క యీడ్చుకుంటూ అక్కడికి వచ్చింది. స్టేషను మాస్టరు ఇదేనండీ అని చూపించాడు. పెద్దమనిషి కోపం పట్టలేక తన చేతిలోని పేము బెత్తంతో ఒకటి వేశాడు. అది పారిపోలేక అక్కడే ఒక పక్క కొత్తిగిలి మెడా కాళ్ళూ యెత్తి యేడ్చింది. పోర్టరు వచ్చి కాలితో దాన్ని అవతలికి తోశాడు. మాష్టరు నవ్వి "మీ కెంత కోపమండీ!" అన్నాడు.

వారి యిద్దరి స్నేహమూ బలిసి, ఆ రాత్రి పెద్దమనిషి స్టేషను మాష్టరు గారికి అతిథిగా ఉండిపోయినాడు. ఆనాటి రాత్రి ఆ కుక్క రైలు క్రింద పడ్డది. రైలు దాని నడుము మీద నుంచి పోయింది. "అంగవ్రాతములో చికిత్సకుడు దుష్టాంగమ్ము ఖండించి"నట్లు, రైలు వ్యాధి గ్రస్తమై నష్టశక్తినయై దాని పశ్చార్ధమును ఖండించింది. కాని శేషాంగ శ్రేణికి రక్ష లేక అది అరగంట తన్నుకొని చనిపోయింది.

4

తరువాత నాల్గు నెలలకు ఆ పెద్దమనిషి తన రెండు కుక్కపిల్లలలో ఒకటి చచ్చిపోయినదని చెప్పి రెండవ దానిని స్టేషను మాష్టరు గారి కిచ్చాడు. అది ఆరు నెలల్లో యెదిగి తన తండ్రివలె అయినది. దానికి భయము లేదు. ఎదురుగా నున్న కొండమీదికి సికారు పోయి వస్తుంది. ఎవరన్నా దానికి మిఠాయి పెట్టబోతారు. అది వాళ్ళకు పళ్ళు చూపించి కరవ వస్తుంది. ఎన్ని ఆడ కుక్కలు వచ్చినా వాటివంక చూడదు. అది పిల్ల వేగోల లను, కుందేళ్ళనూ, నక్కలనూ వేటాడుతుంది. విద్యార్థులు వచ్చి భూతదయోపన్యాసములు చేస్తూంటే వాళ్ళవంక ఓరగా తిరస్కారముగా చూస్తుంది. ఆ పెద్దమనిషి వచ్చి వర్ణ వ్యవస్థను గూర్చి స్టేషను మాష్టరుతో మాట్లాడుతూ ఉంటాడు. ఈ కుక్క వస్తే దీనిని ముద్దుగా ముట్టుకో బోతాడు. అది కోపంగా పళ్ళు చూపించి జీర్ణము కాని వేగోలపు మాంసం కక్కిపోతుంది. రైలు మైలు దూరమున్న దనగా ముక్కోళ్ళతో శ్వాస యెగలాగి పసిబట్టి చీదరించుకొని తొలగిపోతుంది.

మిఠాయి దుకాణమువా డొకనాడు చద్ది మిఠాయి దానిముందర వేయబోయినాడు. అది వాడి పిక్క కండలు పట్టి లాగింది. అది వేగోలం గాని కుక్క కాదన్నారందరూ. దానికి మనుష్యుల్ని చూస్తే వెగటు వేసింది కాబోలు. కొన్నాళ్ళకి జనసమ్మర్దమైన ఆ స్థలాన్ని వదిలిపెట్టి అడవుల్లోనే ఉంటూ వచ్చింది. అప్పుడప్పుడు స్టేషను దగ్గరకు వస్తుంది. నిత్యగహన సంచారం వల్లనో, తల్లిపోలికో తోకకుచ్చు బలిసింది. కోరలు వచ్చినై. మనుష్య గాలి తగిలితే బృహస్పతి తమ్ముడు సంవర్త మహర్షివలె చీదరించుకొని తొలగిపోతుంది. ■